# యశోద

-జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి

యశోదా. నీకున్న పేరు ప్రఖ్యాతులెవరికున్నాయి. అదృష్టం అంటే నీదేనే అంది ఒకావిడ. అనడానికేం, అనేవారు ఏదో ఒకటి అంటూనే వుంటారు.

నాదేముందమ్మా, అని అన్నాను. ఏదో నమ్రత కోసం అల్లాగ అన్నాననుకుంటారు. కాదు నిజం.

నాదేముందీ నిజానికి. ఏదన్నా గౌరవము అంటూ వస్తే అది మా అబ్బాయి వల్ల వచ్చింది. అంతే.

అదుగో, నోరు జారింది మళ్ళీ. మా అబ్బాయి అనగూడదు ఆ లోకేశ్వరుణ్ణి అనుకున్నానెన్నిసార్లో. నోరు జారుతూంటుంది.

నేనై చెప్పుకోగూడదు గాని, సర్వేశ్వరుడు అబ్బాయి ఏమిటి? మొట్టమొదటిసారి కన్నుల పండుగ అయినప్పటి నుంచీ అతను ఏదో వెలుగుగా కనిపిస్తాడు కాని, మామూలు బిడ్డడుగా తోచదు.

ఆడపిల్ల, ఆడపిల్ల... యశోదకు ఆడపిల్ల అన్నారు అందరూ. నవ్వులాటకే అన్నారో, నిజంగా అన్నారో గూడా తెలీదు నాకు. సొమ్మసిల్లి పడుకున్నాను మళ్ళీ తెలివి వచ్చి చూద్దును గదా పక్కలో, పొత్తిళ్ళలో ఉన్నాడు కన్నతండ్రి.

కళ్ళు తెరుచుకుని చూస్తున్నాడు. అనగా ప్రేమగా, భక్తిగా పాప కళ్ళల్లోకి చూద్దును గదా, అవి కళ్ళా? అబ్బే సూర్యచంద్రులు. ఒక్కసారిగా వికసించిన సూర్యచంద్రుల్లా. ఇరుగమ్మలూ వచ్చారు. పొరుగమ్మలూ వచ్చారు. అంగరక్షకులూ వచ్చారు. జోజోలు పాడారు. కలకలలాడుతూ నవ్వు ముఖాలతో అమ్మలక్కలు ఎవరిదారిన వారు వెళ్ళారు.

నాయన తొట్టిలో నిద్రించేవాడు. బ్రహ్మాండం అంతా తన ఉయ్యాలతొట్టి చేసుకున్నవాడు- మా యింట వ్రేపల్లెలో ఒక అయ్య యింట, ఒక అమ్మ గుండెలో చిన్న ఉయ్యాలతొట్టిలో నిద్రిస్తున్నాడు అని అప్పుడు మాకు తెలియదు.

ఎక్కణ్ణుంచి వచ్చిందో, చుప్పనాతిది, పూతనట రాక్షసి వచ్చింది. బాలుణ్ణి చూసింది. నవ్వింది. ముద్దాడింది. ఎత్తుకుంది. అసలు నేను పాపను ఎవరి చేతికీ యివ్వను. ఎత్తుకోడం తెలీక ఏం చేస్తారో అని.

వద్దమ్మా అని అంటూనే వున్నాను, ఎత్తుకుంది. పాలు ఇస్తా అంటుంది. చెబితే వినదు. ఇంటికొచ్చిన వారిని ఏం అంటే తప్పో అని దైవం మీద భారం వేసుకుని చూస్తున్నాను. కన్నయ్య పాలు తాగాడు. పాలేం- దాని ప్రాణాలే త్రాగేశాడు. ఉఁహుఁ హుఁ... అంది. వొణికింది. గింజుకుంది. గిలగిలలాడింది. కళ్ళు తేలేసింది. దాని వికృతాకారం చూశాక అప్పుడు తెలిసింది. అదో దుర్బుద్ధుండి అనీ, చంపబోయి చచ్చింది అనీను. వ్రేపల్లె అంతా గుప్పుమంది. ఎక్కడెక్కడివారూ వచ్చారు. చూశారు ఎవరు వస్తేనేం, ఏమయితేనేం, నాన్న తన లోకంలో తానున్నట్లుగా ఉయ్యాల తొట్టిలో కట్టిన గిలక్కాయను చూస్తూ తనకేం పట్టనట్టు పరున్నాడు. మొదట్నుంచీ అంతే వాడి పని. చేసేది చేస్తాడు. ఏమీ ఎరగనట్టుంటాడు. ఏమిటిరా నాన్నా అంటే- నంగనాచి- నాకేం తెలీదమ్మా అంటాడు. ఏం అంటాం. అల్లాంటి వాళ్ళను.

మరోనాడు-

ఏదో. పండగో పబ్బమో వచ్చింది. ఊరెల్లా నోములూ, పూజలూను, ప్రతివారికీ చేతినిండా పని. ఎక్కణ్ణించి వచ్చిందో... ఒక బండి. దాన్నిండా ఏవేవో వస్తువులు. తొట్టె దగ్గిరకి వచ్చింది. కిష్టయ్య కాలు సాగదీసి- అంత బండినీ ఒక్క తన్ను తన్నాడు. బాలుడెక్కడ? బండి ఎక్కడ? అంత బండీ- ఫెళ ఫెళ విరుచుకుని పడింది. బండి నిండా వున్న వస్తువులు మట్టిపాలయినాయ్. అవి విషం వస్తువులట, మనకేం తెలుస్తయ్. మహా యోగులకు, యోగీశ్వరుడికీ తెలియాలి గాని అందుకే- ఒక్క తన్నుతో నేలపాలు చేశాడు స్వామి.

చల్లని వెన్నెల. ఆరుబయట మంచాలు వేసుకున్నాం. తీరికగా కబుర్లు చెప్పుకున్నాం. మంచం మీద వెల్లకిత్తలా పరుండి చూస్తున్నాడు కన్నయ్య. ఎక్కణ్ణించి వచ్చిందో సుడిగాలి. రావడం ఏమిటి? గిర్రున పసివాణ్ణి ఎత్తుకుని పైకి పోవడం ఏమిటి? అందరం చూస్తూనే వున్నాం. ఏం చేస్తాం? కృష్ణా, కృష్ణా అంటూ ఆందోళనగా వున్నాం. అలివితప్పి వచ్చినప్పుడేం గతి?

అంతలో మిన్ను విరిగి పడ్డట్టు అయింది, దయ్యం మొహమూ వాడూ. వీడూ రాక్షసుడేట- నేల పడ్డాడు. కిష్టయ్య నవ్వు మొహంతో మంచం మీద చేరాడు. తామరపువ్వు రెక్క, సంపెంగ పువ్వు మొగ్గ నలగలేదు. అలతలేదు. కలతలేదు. కిల కిలలాడుతున్నాడు.

ఇక చూడండి. ప్రతివాడూ మా యింటికి అంటే మా యింటికి అంటూ పిలుచుకెళ్ళే వారే. ముద్దు చేసేవారే. సర్వసముదు- ఒక యింట్లో దిగుతాడా? వ్రేపల్లె అంతా వాడి యిష్టారాజ్యం అయింది. అంతేకాదు,

బాబుకు పొద్దున్నే మేల్కొలుపులు పాడాలి. కళ్ళు విప్పుడు ఓ పట్టాన. ఎక్కడలేని మారాం చేస్తాడు. దొంగ నిద్ర పోతాడు. ముఖానికి చేయి అడ్డం పెట్టుకుని- వేళ్ళ సందుల్లోంచి చూస్తాడు. ఊఁ- ఆడింది ఆట పాడింది పాట.

వెన్నంటే అమితమైన ఇష్టం. కవ్వం మొదట్లో మజ్జిగ గాని సయించదు. ఈ వెన్న నానా రొష్టు పెట్టింది. "నాయనా, మనకేం పాడి తక్కువా, వెన్నకు యింత లోటా?" అని ఎంతో చెప్పి చూశాను.

చిలకల్లే వింటాడు. ఊరు ఊరంతా ఒక కొలిక్కి తెచ్చాడు గద. వీడికి తోడు రోహిణి కొడుకు రాముడూ కలిశాడు. ఇంక పట్ట పగ్గాలేమున్నాయ్?

గోపికలు రావడం- మీ అబ్బాయి యిట్లా చేశాడు. మీ అబ్బాయి ఇట్లా చేశాడు అనడం ఇదో మేళం.

వాళ్ళకు తెలియాలి గాని, మా అబ్బాయి దేవుడ్రా మీ యింట్లో వాడు అల్లరి చేయడం మీ అదృష్టమర్రా... అని మనం చెప్తామా? చెబితే బాగుంటుందా? ఎన్ని చెప్పినా వింటారా? ఒకరా, ఇద్దరా? గుంపులుగా గోపెమ్మలు రావడం- యశోదా, చూడు- వీడేం చేశాడో. యశోదా చూడు ఏం చేశాడో మీ అబ్బాయి అనడం. ఇదేమన్నా చాటుమాటా? వాళ్ళు అల్లా గగ్గోలుగా చెప్తుంటే నా చీర కుచ్చెళ్ళు పట్టుకుని వాడు అక్కడే ఉంటాడాయె. నాన్నా నిజమేట్రా? అని అంటే- నాకేం తెలీదమ్మా అంటాడు. నా తండ్రి అబద్ధం ఆడడు. బాబూ ఇంకెప్పుడూ అల్లా చెయ్యకమ్మా అంటే, వుత్తదమ్మా పోనీ నేనేం చేశానో వాళ్ళనే చెప్పమను అంటాడు. వాళ్ళా చెప్పరు. వీడా ఏం ఎరగనంటాడు. ఏం దారి? మా కోడల్ని యిట్లాగన్నాడు, మా అమ్మాయిని ఇట్లాగన్నాడు అన్నారు చివరికి నేను నిగ్గదీసి అడిగితే.

పోండి పసివాడికి పాపాలు అంటగడ్తున్నారు అన్నాను. వెళ్ళారు. వెళ్ళకేం జేస్తారు? నిజమైతేగా... నిష్టూరం వెయ్యడానికి.

★★★

ఛీ, ఛీ, మన్ను తింటారా ఎవరన్నా అంటూ కసురుకున్నాను. నిజమే. ఇప్పుడనుకుని ఏం లాభం? అన్నానమ్మా. అన్నాను. ఊరికే అనడం కాదు. దండించేట్లే అన్నాను.

ఉత్తదమ్మా... అన్నాడు నవ్వుతూ.

వాడు నవ్వినప్పుడల్లా, నా కోపం ఎగిరి చక్కాపోతుంది... నటశేఖరుడు మరి. దొంగ నవ్వులు

## ఫైన్ బిల్డింగ్

ఏదో పనిమీద వైజాగ్ వెళ్ళిన నేను, ఆ ఊళ్ళోనే నా చిన్ననాటి స్నేహితుడు భాస్కరం కాన్వెంట్ నడుపుతున్నాడన్న సంగతి గుర్తుకొచ్చి కలవాలనుకున్నాను. అతని కాన్వెంట్ వున్న కాలనీకి ఆటోలో బయలుదేరాను. ఆ పోష్ కాలనీలో బ్రహ్మాండమైన బిల్డింగ్, ఆటస్థలం, ముందు చక్కని చోట- స్కూలు పెట్టి ఇరవై ఏళ్ళు కావొస్తోంది కాబోలు... నగరంలో వున్న ప్రముఖ స్కూళ్ళలో ఇదొకటని విన్నాను మిత్రుల దగ్గర.

పలకరింపులూ, కూల్ డ్రింకులూ అయ్యాక, "పద మా ఇంటికి" అంటూ బయలుదేరదీశాడు భాస్కరం. ఆ స్కూలు ఆవరణలోనే ఒకపక్కగా కాస్త దూరంగా కొత్తగా కట్టుకున్నాడు.

ఇల్లు చిన్నదే అయినా, కుటీరం ఆకారంలో, ఫైన ఇటాలియన్ టైల్స్‌తో నిర్మాణం విశిష్టంగా వుంది. భాస్కరం టేస్టుని మనసులో మెచ్చుకుంటూ, ఉండబట్టలేక... "ఫైన్... ఫైన్ బిల్డింగ్!" అని అనేశాను.

"కరెక్ట్‌గా చెప్పావ్... నిజంగా ఇది ఫైన్ బిల్డింగే!"... అన్నాడు వాడు నవ్వుతూ.

వాడి మాట అర్థం కాక, అయోమయంగా చూశాను వాడివైపు.

"ఇది స్కూలు పిల్లలు ఆలస్యంగా వచ్చినప్పుడో, యూనిఫాం వేసుకు రానప్పుడో, టై కట్టుకు రానప్పుడో, స్కూలుకి లీవ్ లెటర్ లేకుండా ఎగ్గొట్టినప్పుడో, స్కూల్లో ఇంగ్లీషులో కాక పొరపాటుగా తెలుగులో పిల్లలు మాట్లాడినప్పుడో పిల్లల నుండి వసూలు చేసిన 'ఫైన్' సొమ్ముతోనూ, ఆ సొమ్ముని బ్యాంక్‌లో వేయగా వచ్చిన వడ్డీతోనూ కట్టిన బిల్డింగ్... అంచాత నువ్వన్నది నిజమే, ఇది ఫైన్ బిల్డింగ్!" అని నవ్వేశాడు భాస్కరం.

ఇప్పుడు 'విద్య' పోర్టుఫోలియో సరస్వతీదేవి నుండి లక్ష్మీదేవికి మారిందేమో!

-ఎస్. హనుమంతరావు

నవ్వేవాడు. ఆ నవ్వు వొక్కటే చాలు. కోటి జన్మలు సార్థకం అయినై అనిపించడానికి. అట్లాగే దొంగ నవ్వు నవ్వాడు అనుకుని చిట్టిదెబ్బ యిట్టే వేశాను.

అమ్మా- నేనెందుకు మన్ను తింటానమ్మా అంటూ నోరు తెరిచాడు. మన్నెందుకు వుంటుందీ ఆ నోట్లో.

మన్ను; మన్ను. నా మాటే మన్ను. ఆ నోట్లో- విరాట్ స్వరూపం వుంది విశ్వేశ్వరుడి నోట్లో విశ్వం విశ్వమే వుంది. నన్ను నేనే నమ్మలేకపోయాను. నేను యశోదనేనా? కళ్ళు చెదిరిపోయాయి నాకు. చప్పున తెలివి వచ్చింది. కృష్ణా, జగత్ప్రభూ! నిన్ను కని పెంచడము నా అదృష్టము. నీ ముద్దుమురిపాలు చూడడం నా జన్మకు సాఫల్యం. నీ అందచందాలు, నీ హొయలు, నీ లీలలు కళ్ళారా చూడడం వేన వేల జన్మల తపస్సుకు ఫలితం, నాన్నా నన్ను మన్నించు. ఈ లీలలు చాలించు. చూడలేనన్నాను. చేతులు జోడించాను. పాదాలు ముద్దెట్టుకున్నాను. కూలబడ్డాను. బాబు ఎగిరి నా వొళ్ళోకి దూకాడు.

ఓః-

నిజమే నాదే అదృష్టం.

ఏం అదృష్టం. సర్వేశ్వరుడు కుమారుడు కావడం ఎంత ఇదో చప్పు చప్పున తెలిసి వచ్చింది.

నాన్నను మాట అనలేను. ఎవరన్నా అంటుంటే సహించలేను. నాదో వెఱ్రి అనుకునేవారూ వున్నారు. అనుకున్నారు కూడా.

ఎవరో కొద్దిమంది "లేక లేక కలిగిన సంతానమమ్మా యశోదకు. ఆ కొడుకు ఏం చేసినా చూస్తూ వుంటుంది" అనేవారు.

వాళ్ళకేం తెలుసూ? పిచ్చివాళ్ళు. నా బిడ్డ దేవుడు.

పువ్వును చూడచ్చు. చూడక పోవచ్చు. పరిమళాన్ని చూడకపోవడం ఎవరి తరం?

కొండ ఎత్తాడు నా బిడ్డ. ఊరు ఊరంతా దణ్ణాలు పెట్టారే మరి? దేవతలకు దేవతలే దాసోహం అన్నారే మరి?

నాన్నా ఈ దుడుకు పనులుమానుదూ, అన్నాను. నటశేఖరుడు నవ్వాడు.

లాలనగా బుజ్జగిస్తూ- నాకోసం యీ దుడుకు పనులు మానుదూ అంటున్నాను.

చప్పున నా నోరు మూసినట్లు, నన్ను ముద్దు పెట్టుకుని మరీ అన్నాడు- అమ్మా నా మీద బెంగ పెట్టుకోకు. అంతగా అయితే నీకు ముందే చెప్తాలే అని.


ఇదేం వరం. ఇవాళ ఈ అఘాయిత్యము చేస్తా అని ముందే చెప్తాట్ట. అమ్మో. నా గుండెలు ఆగుతాయా? నేనేమై పోవాలీ??

ఇదీ మహానుభావులకు తల్లులైనవారు పడే కష్టం.

కాళింది మడుగు కథ ఎవరెరుగరు? ఆ ఛాయలకు ఏ ప్రాణైనా పోయిందా? అలా వెళ్ళి ఎవరయినా బతికి బయటపడ్డారా? అమ్మా కాళింది మడుగుకు వెళ్తున్నా అన్నాడు. వొద్దు వొద్దు అన్నా వింటాడా? ఒద్దు అని అపశకునం మాట నేను అనగలనా? అల్లాగని పోయిరా నాయనా అని అనగలనా?

కృష్ణా, నాకు యిదేం పరీక్ష?... అని కళ్ళ నీరు ఆపుకున్నాను.

అమ్మా, పోనీ నువ్వూ రా అన్నాడు. ఆ ధీమా ఏ బిడ్డకు వుంటుంది. వెళ్ళాడు.



ఊరు వూరంతా. వ్రేపల్లె వ్రేపల్లె అంతా అక్కడే వుంది. ఏమయింది? అతి సుకుమారమయిన ఆ పాదాలు, తామర రేకుల వంటి పాదాలు. సుతిమెత్తని యోగుల మనస్సులలో చిందుతొక్కే నా బిడ్డ పాదాలు కాళీయుడి తలపై నాట్యమాడినవి. ఆశ్చర్యపోయాను. నాన్నా, అన్నంత పనీ చేశావు గద అనుకున్నాను.

నా బిడ్డ నటసార్వభౌముడు నాకేసి చూసి నవ్వాడు. ఆఁఆ నవ్వు కోసం- ఎన్ని జన్మలయినా ఎత్తుతాను. ఎంత తపస్సు అయినా చేస్తాను.

పిల్లనగ్రోవిని ఎవరెరగరు? గోపాలకృష్ణుడు వేణు గోపాల కృష్ణుడు అయ్యాడు. గోపాలకృష్ణుడి మురళీ నాదం- మురళీనాదమా? ఆ వేణునాదం వేదనాదం కాదా?

పెద్దవాడయ్యాడు. బృందావనం పులకించింది. మీ అబ్బాయి చూడవమ్మా. చెప్పరాని పనులు చేస్తున్నా డన్నారు. కల్లబొల్లి చాడీలు చెప్పారు. వారి మాటలే దీవనలైనవి. వెన్నెల రాత్రులు, బృందావనం- కలకాదు. కల్ల కాదు. కళ్ళారా చూడండర్రా అని సర్వమయుడు లీల నడిపాడు.

ఆ వెన్నెల రాత్రులు నాకు తెలుసు. ఆ లీలలు నాకు తెలుసు. ఆ వేణునాదం, గాయక సార్వభౌముడు గోపాలకృష్ణుడి మురళీనాదం. నాకు తెలుసు. నా హృదయానికే తెలుసు. నేనింక వంద జన్మలు, వేనవేల జన్మలు ఎత్తనీ- ఈ బిడ్డ- మళ్ళీ అంటున్నాను, అనగూడదు అని తెలిసి కూడా అంటున్నాను. నా బిడ్డ మహాజ్ఞాని, భగవంతుడు, సర్వేశ్వరుడు. నా బాలకృష్ణుని మురళీనాదం- నా తనువు నిండుతుంది. నా హృదయం నిండుతుంది. అదే నన్ను బతికిస్తుంది. కృష్ణా, జగద్రక్షకా అని చేతులు జోడించడం తప్ప నా హృదయం సమర్పిం చడం తప్ప- నాదేముందీ? నాకేం పేరు ప్రఖ్యాతులు వద్దు, కృష్ణుడు నా బిడ్డడు అని తప్ప - చాలు.

(జరుక్‌శాస్త్రిగా ప్రసిద్ధులు. పేరడీ రచనకు తెలుగులో ఆద్యులు. సాహిత్యంలో అన్ని ప్రక్రియలలోనూ ఔననిపించుకున్నారు. 1914-1968)